ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు

5★★

శనివారం 29 మార్చి 2025



రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:30 (శనివారం సాయంత్రం)

సహర్ 4:53 (ఆదివారం ఉదయం)

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

రాయికల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్నపెల్లిలో వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ముక్తేశ్వర్ మాట్లాడుతూ కొత్తగా అయిల్ పామ్ పంట సాగు చేయడానికి ముందుకు వచ్చే రైతులకు చెట్లను 90 శాతం సబ్సిడీపై, డ్రిప్ పరికరాలను బీసీ, సన్న, చిన్న రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో నరేష్, లోహియా కంపెనీ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ రాజేష్, సర్పంచ్ లత రాజు, ఉప సర్పంచ్ ఆంజనేయులు, కోల శ్రీనివాస్, భూమేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించాలి

రాయికల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున సకాలంలో ఇంటిపన్నులు చెల్లించాలని రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ అన్నారు. ప్రజలు తమ వార్డుల్లో అందుబాటులో ఉన్న సంబంధిత బిల్‌కలెక్టర్, వార్డు ఆఫీసర్లకుగాని, మున్సిపల్ కార్యాలయం కౌంటర్లలో చెల్లించాలని అన్నారు. ఆర్థిక సంవత్సరం 2024-25 వరకు వడ్డీతో ఇప్పటికే చెల్లించిన సదరు యాజమానులకు చెల్లించిన వడ్డీలో 90 శాతం వడ్డీని వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26 ప్రాపర్టీ ట్యాక్స్ డిమాండ్‌లో సర్దుబాటు అవుతుందని కమిషనర్ తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బీర్‌పూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ సూచించారు. శుక్రవారం బీర్‌పూర్ మండలంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పల్లె దవాఖానాను డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఈ సందర్భంగా మందులు, వైద్యపరికరాలను, రికార్డులు, పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల

దుమ్మాలకు చెక్..

- వైద్య ఆరోగ్య శాఖలో 'అబాస్'
- వైద్యాధికారి నుంచి అటెండర్ వరకు వివరాల సేకరణ
- విధులు నిర్వర్తించే లొకేషన్ నుంచే అటెండెన్స్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ
- జిల్లావ్యాప్తంగా సుమారు మూడువేల మంది ఉద్యోగులు

జగిత్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో విధులకు డుమ్మా కొట్టే వారికి చెక్ పడనుంది. సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో విధులు నిర్వర్తించే సిబ్బంది గైర్హాజరవడం, సమయానికి ముందే వెళ్తుండడంతో రోగులకు సరియైన వైద్య సేవలు అందడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో డుమ్మాలు కొట్టే వారికి చెక్ పెట్టేందుకు అబాస్ (ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టం) అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. అందులో భాగంగా వైద్యారోగ్య సిబ్బంది నుంచి ఆధార్ నంబర్లు, లొకేషన్లను స్వీకరిస్తున్నారు.

● ప్రత్యేక యాప్‌లో వివరాలు అప్‌లోడ్...

జిల్లాలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), సబ్ సెంటర్, బస్తీ దవాఖాన, పల్లె దవాఖాన, అర్బన్ హెల్త్ సెంటర్లలో డాక్టర్ నుంచి అటెండర్ వరకు వారి వివరాలను సేకరిస్తున్నారు. ప్రత్యేకయాప్‌లో సిబ్బంది వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లోనే సిబ్బంది హాజరు కోసం యాప్ ఓపెన్ అవుతుంది. అప్పుడు మొబైల్ ద్వారా ఫేస్ రికగ్నిజేషన్, జియో ఫెన్స్‌డ్ విధానంతో హాజరు నమోదు అవుతుంది. ఎక్కడో ఉండి అటెండెన్స్ వేస్తామంటే యాప్ తీసుకోదు. దీంతో ఆరోజు అటెండెన్స్ పడకుండా ఆబ్సెంట్ పడుతుంది. జిల్లావ్యాప్తంగా వైద్య సిబ్బంది సుమారు మూడు వేల వరకు ఉంటారు. పలు చోట్ల వంతుల వారీగా విధులకు హాజరవుతారని ఆరోపణలున్నాయి.

బయోమెట్రిక్ స్థానంలో అబాస్...

జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, పల్లె, బస్తీ దవాఖానాలు, సబ్‌సెంటర్లలో వైద్యులు, సిబ్బంది హాజరు నమోదుకు తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్‌సంస్థ అభివృద్ధి చేసిన మొబైల్ ముఖఆధారిత, జియోఫెన్స్‌డ్ విధానంలో నూతన సాంకేతికతను తీసుకవచ్చింది. ఇప్పటివరకు బయోమెట్రిక్‌తో పాటు, ఫేస్ యాప్ ద్వారా హాజరు తీసుకునే వారు. కానీ జిల్లా వ్యాప్తంగా చాలా ఆసుపత్రుల్లో బయోమెట్రిక్ గానీ ఫేస్‌యాప్ ద్వారా హాజరు తీసుకోకుండానే విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం అమల్లోకి రానున్న అబాస్ హాజరుతో గైర్హాజరుకు పూర్తిచెక్ పెట్టవచ్చని, విధులకు డుమ్మా కొట్టేవారి విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు దీనిని అమల్లోకి తీసుకొని రావడానికి ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈవిధానం ఇప్పటికే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, వాటికి అనుబంధంగా కొనసాగుతున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో అమలు చేస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు..

జనరల్ ఆసుపత్రి	1
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	17
24 గంటలు పనిచేసే పీహెచ్‌సీలు	7
పల్లె దవాఖానాలు	102
బస్తీ దవాఖానాలు	9
అర్బన్ హెల్త్ సెంటర్లు	5
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	3
ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు	151

● ఉద్యోగుల్లో వ్యతిరేకత..

వైద్య ఆరోగ్య శాఖలోని వైద్యులు, సిబ్బంది హాజరు కోసం బయోమెట్రిక్, ఫేస్ యాప్‌లను వినియోగిస్తున్నారు. అయినప్పటికీ అబాస్ పేరిట తీసుకువచ్చిన నూతన విధానాన్ని వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులతో చర్చించకుండానే అమలు చేస్తున్నట్లుగా ఉత్తర్వులు విడుదల చేయడాన్ని వైద్యులు, సిబ్బంది వ్యతిరేకిస్తున్నట్లుగా -

మిగతా 8లో

వేసవి ప్రణాళికతో నాణ్యమైన విద్యుత్ సరఫరా

● ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సాలియా నాయక్



బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఈ సాలియా నాయక్

కథలాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రణాళికతో ముందస్తుగా తీసుకున్న చర్యల్లో భాగంగా రైతులు, ఇతరత్రా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సాలియా నాయక్ పేర్కొన్నారు. మండలంలోని చింతకుంట 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో రు. 10 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన బ్రేకర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా రైతులకు భద్రతా సూచనలు చేశారు. రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సిబ్బందిని సంప్రదించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్‌స్టేషన్లలో విద్యుత్ అంతరాయాలు లేకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం సబ్‌స్టేషన్‌లో మొక్కలు నాటారు. ఆయన వెంట డీఈఈ గంగారాం, ఏడీఈ తిరుపతి, ఏఈలు నవీన్, లైన్‌మెన్, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి



పైడిపల్లిలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

వెల్గటూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో ఎదిగి భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ప్రధానోపాధ్యాయుడు తులసి ఆగమయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని పైడిపల్లి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సతతీష్‌కుమార్, సునిత, రజిని, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

మల్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను పోలీసులు పరిశీలించారు. మల్యాల, తాటిపల్లిలో గల పరీక్ష కేంద్రాలను ఎస్సై నరేశ్‌కుమార్ సందర్శించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.

సహకార సంఘం సర్వసభ్య సమావేశం

రాయికల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో శుక్రవారం ఛైర్మన్ ఏనుగు మల్లారెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో 01-04-2024 నుంచి 25-03-2025 వరకు జమ, ఖర్చుల వివరాలు, 2025-26 సంవత్సరానికి అంచనా బడ్జెట్, ఆదాయ, వ్యయాలు ఆమోదించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యుల వాటాధనంపై 10 శాతం డివిడెండ్ సభ్యుల ఖాతాకు జమచేయడం జరిగిందన్నారు. రాయికల్ సహకార సంఘానికి నూతనంగా ఎఫ్‌పీవో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ మార్కండేయ, పీఏసీఎస్ వైస్‌ఛైర్మన్ బేతి మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బీర్‌పూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతులు సహకార సంఘంలో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని బీర్‌పూర్ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు ముప్పాల రాంచందర్ రావు అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘంలో ఎక్కువ డిపాజిట్లు చేయాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా సంఘం పరిధిలోని రైతులకు ఇఫ్కో వారి ద్వారా ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తుంగూర్ డీసీసీ బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్, ఇఫ్కో ఏరియా మేనేజర్ శ్రీధర్, మందాటి సాగర్, వూరడి కొయురవెల్లి, వంగపల్లి కృష్ణరావు, చల్ల రాజం, నరిమెట్ల సతీష్, చిక్కుల రవీందర్, పోడూరి పోశం, లక్ష్మీరాజం, సెక్రెటరీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సన్మానం



ప్రభుత్వ విప్‌ను సన్మానిస్తున్న నాయకులు

భీమారం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మేడిపల్లి మండల అంబేద్కర్ సంఘం నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇజ్రాయిల్, ఉమ్మడి మేడిపల్లి మండల తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బంగారు దీపక్, భీమారం మండల ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి మాకులి కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



బ్రహ్మోత్సవాల్లో సహకరించిన దాతలను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యాయని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి క్షేత్రంలో జరిగిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో సహకరించిన దాతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, అర్చకులు, ఉద్యోగులకు ఆలయం పక్కన స్థానిక టీటీడీ ధర్మశాల ఆవరణలో సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతీఒక్కరిని అభినందిస్తున్నానని తెలిపారు. సన్మాన కార్యక్రమంలో తాను పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. బ్రహ్మోత్సవాల్లో వివిధ శాఖల అధికారులు ఎంతో సమన్వయంతో పనిచేశారన్నారు. ఏఐసీసీ ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన డీసీసీ అధ్యక్షుల సమావేశంలో తనకు మాట్లాడే అవకాశం లభించడం చాలా ఆనందకరమైన విషయమన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సుల వల్లే తనకు ఈ అవకాశం దొరికిందని ఆయన తెలిపారు. లక్ష్మీనరసింహ స్వామి ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్ మాట్లాడుతూ 13రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో సహకరించిన ప్రతిఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ సహకారంతో ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఆయన అన్నారు. అంతకు ముందు బ్రహ్మోత్సవాల్లో స్వామి వారి సేవను మోసిన స్థానిక బోయలకు రూ. 25 వేలు, దివిటి మోసే నాయీబ్రాహ్మణులకు ఐదు వేల రూపాయలను వ్యక్తిగతంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అందించారు. మండలంలోని పెద్దనక్కలపేట గ్రామానికి చెందిన భూక్యా శ్రావణి పవర్ లిఫ్టింగ్ 52 కేజీల విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా ప్రభుత్వ విప్ ఆమెను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంన ర్సింహారెడ్డి, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, ఉమాసాగర్, సతీష్, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

● ముత్యంపేటలో కోతకు గురైన రోడ్డు

● కంకర లేచి ప్రమాదకరంగా గొర్రెగుండం రహదారి



కోతకు గురైన గొర్రెగుండం వెళ్లే మార్గం



ముత్యంపేట శివారులో ప్రమాదకరంగా మారిన రహదారి

మల్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో తరచూ వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం అసౌకర్యానికి గురవుతున్నారు. మండలంలోని ముత్యంపేట నుంచి కొండగట్టు వెళ్లే మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద తారు రోడ్డు కోతలకు గురై ప్రమాదకరంగా మారింది. నిత్యం మట్టి, కంకర తరలించే టిప్పర్లతో రహదారిపై ఒత్తిడి పడి కొండగట్టు వరకు తారు రోడ్డు కోతలకు గురైంది. పలుమార్లు ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలూ ఉన్నాయి. రామన్నపేట నుంచి గొర్రెగుండం వెళ్లే తారురోడ్డు పూర్తిస్థాయిలో చెడిపోయింది. దీంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారి తారు కొట్టుకుపోయి, కంకర లేచింది. ఈ రహదారిపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాహనాలు నడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల మల్యాలకు వచ్చిన కేంద్రహోంశాఖ సహాయమంత్రి, స్థానిక ఎంపీ బండి సంజయ్‌ను రహదారి కోసం నిధులు మంజూరు చేయాలని నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రమాదకరంగా మారిన ఈ రహదారులను కనీసం మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ. 20 లక్షలు మంజూరు

కథలాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మెనకు సీసీ రోడ్ల నిర్మాణాలకుగాను ఉపాధిహామి పథకం కింద 20 లక్షల రూపాయలు మంజూరైనట్లు మాజీ సర్పంచ్ పిడుగు లావణ్యతిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

రైస్‌మిల్లుల్లో అధికారుల తనిఖీలు

- ధాన్యం నిల్వల పరిశీలన



మైలాపూర్ రైస్ మిల్లుల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

జగిత్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల పారా బాయిల్డ్ రైస్ మిల్లుల్లో అధికారులు శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రైస్ మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యం నిల్వలపై లెక్కలను తేల్చడానికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), సివిల్ సప్లయి కార్పొరేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా సోదాలు చేశారు. గడువు ముగిసినప్పటికీ కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అప్పగించకుండా మిగిలి ఉన్న ధాన్యం నిల్వలపై పరిశీలన జరిపారు. ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ (పీవీ)ను నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 46 పారా బాయిల్డ్ రైస్ మిల్లుల్లో అధికారులు సోదాలు జరుపుతున్నట్లు సమాచారం.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన గోల్ల సత్తయ్య(55) వెన్నునొప్పి భరించలేక గురువారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపినవివరాల ప్రకారం.. సత్తయ్య ఐదు సంవత్సరాల నుంచి తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి11 గంటల సమయంలో ఇంటిముందు ఉన్న 25కిలోవాట్ల విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వైరును పట్టుకున్నాడు. రెండు చేతులకు తీవ్రమైన గాయాలు కాగా సత్తయ్యను కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. మృతుడు సత్తయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనం పట్టివేత

గన్నేరువరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని గుండ్లపల్లి వద్ద గన్నేరువరం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. తిమ్మాపూర్ మండలం రేణికుంట నుంచి సిద్దిపేటకు టీఎస్28టి7996గల వాహనంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన డ్రైవర్ పల్లెచిన్న, వాహన యజమానిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

ఘాట్ రోడ్డు నిర్మాణం

పూర్తయ్యేదెన్నడో..?

- అమలుకు నోచుకోని పర్యాటక కేంద్రం హామీ
- అభివృద్ధికి దూరంగా మామిడిపల్లి సీతారామ ఆలయం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పనులు ప్రారంభించి వదిలేసిన ఘాట్‌రోడ్డు, మామిడిపల్లి గుట్టపై వెలిసిన శ్రీసీతారామచంద్రస్వామి

కోనరావుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిపల్లి సీతారాములస్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వహయాంలో మరో భద్రాచలం ఆలయంగా మార్చి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్న మాట కలగానే మిగిలిపోయింది. ఘాట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు జరగడం లేదు. దీంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● ఆలయానికి ప్రత్యేక గుర్తింపు..

కోనరావుపేట మండలం మామిడిపల్లి గుట్టపై వెలిసిన సీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉండడమే కాకుండా భక్తులు కొంగు బంగారంగా కొలుస్తారు. ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య జాతర, సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరుగుతాయి. వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. వేములవాడ ఆలయ ఆధీనంలో మామిడిపల్లి సీతారాముల ఆలయం కొనసాగుతోంది. గత ప్రభుత్వ పాలనలో అప్పటి ఎమ్మెల్యే రమేష్‌బాబు మరో భద్రాచలం ఆలయంగా తీర్చిదిద్ద డంతో పాటు పర్యాటక కేంద్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు. సీతమ్మ తల్లి పర్ణశాల నిర్మాణం చేపడుతామన్న హామీ అమలుకు నోచుకోలేదు. మూడు సంవత్సరాల క్రితం కోటి 19లక్షల రూపాయలతో ఘాట్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. ఆలయ అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించకపోవడంతో ఎలాంటి పనులు జరగడం లేదు. ఇటీవల మాఘమాసం సందర్భంగా ఎమ్మెల్యే సూచన మేరకు రెండు రోజుల పాటు పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ తిరిగి అర్ధంతరంగా వదిలేశారు. ఇప్పటికైనా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించి పనులు పూర్తయ్యేలా, ఆలయ అభివృద్ధి కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా మార్చాలి..

- కృష్ణహరి, ఆలయ అర్చకులు



గత ప్రభుత్వ పాలనలో మా మిడిపల్లి సీతారామ స్వామి ఆల యాన్ని మరో భద్రాచలం ఆల యంగా మారుస్తారని హామీ ఇ చ్చారు. పర్యాటక కేంద్రంగా మా రితే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికైనా ప్రారంభించిన ఘాట్ రోడ్డు నైనా పూర్తిచేస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

సినీ ఫక్కీలో చోరీ

● బ్యాంకు నుంచి డ్రాచేసిన రూ. 1.50 లక్షలు అపహరణ

కోరుట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శుక్రవారం పట్టపగలు సినీఫక్కీలో చోరీజరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన చింతకుంట శ్రీహరి అనే రైతు అతని స్నేహితుడితో కలిసి కోరుట్ల పట్టణంలోని ఎస్‌బీఐ ప్రధానబ్యాంకుకు డబ్బులు డ్రా చేయడానికి ద్విచక్రవాహనంపై వచ్చారు. బ్యాంకులోకి వెళ్లి రూ. 1,50,000 నగదు డ్రా చేసుకొని ద్విచక్ర వాహనంలో పెట్టుకున్నాడు. అప్పటికే వీరిని గమనిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు శ్రీహరి వాహనం తీస్తున్న సమయంలో మీ జేబునుంచి 100రూపాయలు కింద పడిపోయాయని ఓ వ్యక్తి చూపించాడు. వాహనంపై ఉన్న శ్రీహరి కిందికి దిగి వంద రూపాయల నోటును తీసుకునే క్రమంలో వెనుకాల ఉన్న మరో గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంలో ఉన్న రూ. 1,50,000 నగదును అపహరించి వారు తెచ్చుకున్న ద్విచక్ర వాహనంపై పరారీ అయ్యారు. శ్రీహరి తేరుకొని చూసేసరికి బ్యాగులో ఉన్న నగదు కనపడకపోవడంతో బోరున విలపించాడు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బ్యాంకుతో పాటు పట్టణంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అనుమానితుల సీసీ ఫుటేజీలను పోలీసులు విడుదల చేశారు. బాధితుడు శ్రీహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.



పోలీసులు విడుదల చేసి అనుమానితుల ఫొటో

నమిళికొండలో దొంగతనం

కొడిమ్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నమిళికొండ గ్రామానికి చెందిన బల్లాడి లక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 80వేల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకుపోయినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. బల్లాడి లక్ష్మి ఈ నెల 26న కరీంనగర్‌కు పని నిమిత్తం వెళ్లారు. శుక్రవారం ఇంటికి వచ్చి చూసేసరికి దొంగతనం జరిగింది. ఎవరులేని సమయంలో ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకు పోయారని బాధితురాలు పిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్టు తెలిపారు.

అస్వస్థతకు గురైన ఉపాధి కూలీ

శంకరపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని చింతగుట్ట గ్రామంలో శుక్ర వారం ఉపాధి హామీ పనిచేస్తూ గణపతి అనే వ్యక్తి అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. వెంటనే పనిచేస్తున్న తోటికూలీలు ఆటోలో తాడికల్ వరకు అక్కడినుంచి 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

20క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సిరిసిల్ల క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం బల్యాలనగర్‌లోని ఓ పౌల్ట్రీ ఫాం వద్ద అక్రమంగా నిల్వచేసిన 20క్వింటాళ్ల రేషన్ బియ్యంను శుక్రవారం పట్టుకున్నామని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. ఈ రేషన్ బియ్యంను నిల్వచేసిన కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట గ్రామానికి చెందిన బుర్ర అంజయ్యను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తిపై కేసు

కొడిమ్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ రైల్వేగేట్ దగ్గర 150గంజాయి అమ్ముతున్న మండలంలో పూడూర్ గ్రామానికిచెందిన ఈదురి అనోక్‌పై శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. రైల్వేగేట్‌దగ్గర అనోక్ గంజాయి అమ్ముతున్నాడన్న పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసివెళ్లి అతనిని పట్టుకున్నట్లు తెలిపారు.

నిందితుడిని విచారించగా బీహార్‌కు చెందిన షరీఫ్‌అనేవ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి నట్లు ఒప్పకున్నాడన్నారు. ఈ మేరకు అనోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొదురుపాకలో చోరీ..

బోయినపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొదురుపాక గ్రామంలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఐదు తులాల బంగారు ఆభరణాలతోపాటు 24తులాల వెండిని ఎత్తుకెళ్లినట్టు ఎస్సై పృధ్వీధర్‌గౌడ్ తెలిపారు. గ్రామానికిచెందిన సట్టాజలజ ఇంటికి గడియపెట్టి తాళం వేయకుండా అంగన్‌వాడీపాఠశాలకు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి ఇంటికి తలుపుతెరిచి ఉండడంతో అనుమానంతో బంగారు ఆభరణాలను పరిశీలించగా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ సింగరేణి ఉద్యోగి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణానికి చెందిన ఎండి. హైమద్ (51) చికిత్స పొందుతూ మృతి చెందాడు. బసంత్‌నగర్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 26న పెద్దపల్లి పట్టణానికి చెందిన గంగిడి శ్రీనివాస్ రెడ్డి, హైమద్ ద్విచక్రవాహనంపై సింగరేణి లో విధులకు వెళ్తుండగా రాఘవపూర్ వద్ద పెద్దపల్లికి వస్తున్న ఆర్టీసీ బస్ అతివేగంతో ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. హైమద్ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య జూలేక బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్ నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

చారిత్రక ప్రాంతానికి

రవాణా సౌకర్యం

- మానేరు నది పాత రోడ్డుపై నూతన వంతెన నిర్మాణం
- కరీంనగర్- ఎలగందల్ మధ్య తగ్గనున్న దూరం

భగత్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-ఎలగందల్ మధ్య నూతనంగా నిర్మిస్తున్న వంతెనతో చారిత్రక ప్రాంతానికి రవాణా సౌకర్యం మెరుగుపడనున్నది. కొత్తపల్లి మండలంలోని చింతకుంట, ఎలగందల్, కమాన్‌పూర్, బావుపేట, ఖాజీపూర్ గ్రామాలతో పాటు, సిరిసిల్ల వేములవాడకు వెళ్లే ప్రయాణికులకు దూరం తగ్గనున్నది. ఎల్ఎండి నిర్మాణంతో పాత రోడ్డు మానేరులో మునిగి పోవడంతో దశాబ్దాలకు పైగా ఎలగందల్ గ్రామం కరీంనగర్ జిల్లా కేంద్రానికి దూరమైపోయింది. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెంతనే ఉన్న ఎలగందల్ గ్రామానికి చేరుకోవాలంటే పది కిలోమీటర్లకు పైగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం కరీంనగర్-ఎలగందల్ గ్రామాల మధ్య మానేరు నదిపై నూతనంగా గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి పునాదులు వేశారు. బ్రిడ్జి నిర్మాణం శరవేగంగా పూర్తి కావస్తుండడంతోఎలగందల్ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కరీంనగర్-సిరిసిల్ల వెళ్లాలంటే ఈ ప్రాంతంలో పాత రోడ్డు ఉండేది. ఎల్ఎండీ నిర్మాణంతో పాత రోడ్డు మానేరు నీటిలో మునిగి పోయింది. బ్యాక్ వాటర్‌తో పాటు, మానేరు నది నీరు పూర్తిగా ఈ చింతకుంట, ఎలగందల్ గ్రామాలకు ఆనుకుని రావడంతో ఆ రోడ్డు పూర్తిగా కనుమరుగైంది.



ఎలగందల్-కరీంనగర్ మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి

● పర్యాటకులకు సౌకర్యం

ఎలగందల్ గ్రామం ఒకప్పుడు జిల్లా కేంద్రంగా ఉండేది. గ్రామంలో ప్రాచీన కళా సంపద, కోట బురుజులు, చారిత్రాక ప్రదేశం కావడంతో బ్రిడ్జి నిర్మాణంతో పర్యాటకుల తాకిడి కూడా పెరగనున్నది. బ్రిడ్జి నిర్మాణం చేయాలని ఈ ప్రాంత వాసులు ఏళ్లుగా కోరుతున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంత వాసులకు అందుబాటులోకి తీసుకురావా లని కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణంతో తీరనున్న ప్రజల వెతలు

- మంద రమేష్, మాజీ ఎంపిటీసీ, ఎలగందల్



కరీంనగర్-ఎలగందల్ గ్రామాల మధ్య పాత రోడ్డు ప్రాంతంలో నూతనంగా బ్రిడ్జి నిర్మాణం చేపడుతుండడంతో ప్రజల వెతలు తీరనున్నాయి. కరీంనగర్‌కు ఎలగందల్ గ్రామం దూరం తక్కువైనా బ్రిడ్జి లేక పోవడంతో చుట్టు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నది. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న గ్రామానికి సరైన రవాణా లేక వెనుకబాటుకు గురైంది. బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

ప్రేమ.. పరువు... హత్య...

- కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్న యువతీ, యువకుడు
- పలుమార్లు పంచాయితీ
- కులాంతర వివాహం చేసుకుంటే పరువు పోతుందని భావించిన తండ్రి
- అదును చూసి యువకుడి హతం
- ముప్పిరితోట గ్రామంలో విషాదం
- శాంతిభద్రతల దృష్ట్యా గ్రామంలో పోలీస్ పికెట్

పెద్దపల్లి/ఎలిగేడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కూతురిని ప్రేమిస్తున్నాడనే అక్కసుతో అమ్మాయి తండ్రి యువకుడి పుట్టిన రోజే పథకంప్రకారం గొడ్డలితో నరికి చంపిన ఘటన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో చోటు చేసుకున్నది. పూరేళ్ల పరుశరాములుగౌడ్-జ్యోత్స్న దంపతుల కుమారుడు సాయి కుమార్(20) రెండేళ్లక్రితం ఇంటర్మీడియెట్‌లో చేరి మధ్యలోనే ఆపేశాడు. అదే గ్రామానికి చెందిన వేరే కులానికి చెందిన అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఆ అమ్మాయి డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. వీరి ప్రేమవ్యవహారం తెలుసుకున్న అమ్మాయి తండ్రి సాయికుమార్‌ను మందలించాడు. అయినప్పటికీ వారు కలుస్తుండడంతో ఈ విషయమై గ్రామంలో పంచాయితీ జరిగింది. వారు ఒకరికొకరు ఇష్టపడడంతో వివాహం చేయాలని సలహా ఇచ్చారు. ఇరు కుటుంబాలు అందుకు అంగీకరించారు. కానీ కూతురు ప్రేమ వివాహం చేసుకోవడం తండ్రికి ఇష్టం లేదు. మరోవైపు వేరే కులానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెండ్లి చేస్తే కులంలో, గ్రామంలో పరువు పోతుందని బంధువులు పేర్కొన్నారు. దీంతో ఏమి చేయాలో పాలుపోని అమ్మాయి తండ్రి యువకుడిని హతమార్చేందుకు ప్లాన్ వేశాడు.

అమ్మాయిని ప్రేమించిన పాపానికి కసాయి చేతిలో కొడుకు గొడ్డలివేటుకు గురై మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. సాయికుమార్ పుట్టిన రోజు గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన ముత్యం సది(సదయ్య) అనే వ్యక్తి గొడ్డలితో దాడిచేసి విచక్షణరహితంగా నరికి చంపాడు. అదే గ్రామానికి చెందిన యువతి, సాయికుమార్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారని, పెళ్ళి చేసుకుంటామని తెలిపారని మృతుడి తల్లిదండ్రులు విలపించారు. కొడుకుపై కక్షపెంచుకొని అదనుచూసి చంపాడని బోరున విలపించారు. గతంలో రెండు సార్లు హత్యాయత్నం చేశారని ఆవిషయం కులంలో చర్చించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని మృతుడి తండ్రి పర్శరాములు గౌడ్ పేర్కొన్నారు. తమ కుమారుడిని హత్యచేసిన నిందుతున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు కటుంబ సభ్యులు విలపించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. గతంలో కూతురిని కోల్పోయామని ఉన్న ఒక్కగానొక్క కొడుకు హత్యకు గురయ్యాడని, తమకు దిక్కెవరంటూ రోదించారు. సంఘటన స్థలాన్ని డీసీపీ కరుణాకర్, ఏసీబీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సైలు సనత్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్, స్వామి, నరేష్‌కుమార్, శ్రావణ్‌కుమార్‌లు పరిశీలించారు. నిందుతుడు ముత్యం సదయ్యపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బారెడ్డి తెలిపారు.



విలపిస్తున్న సాయి కుమార్ తల్లి

గ్రామంలో పోలీస్ పికెట్

జిల్లాలోనే సంచలనం సృష్టించిన పరువుహత్య ఘటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గురువారం రాత్రి పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ఇరు కుటుంబాల సామాజికవర్గాలు వేర్వేరు కావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ ఉన్నతాధికా రులు ముందస్తు చర్యలు చేపట్టి నిఘాను కట్టుదిట్టం చేశారు. జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బలగాలు రప్పించి జూలపల్లి, ధర్మారం, సుల్తానాబాద్, బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ల ఎస్సైల ఆధ్వర్యంలో గ్రామంలో ప్రధాన కూడళ్లు, నిందితుడు, మృతుడి ఇంటి వద్ద పోలీస్ పహరా ఏర్పాటుచేశారు. పోలీసు పహారా మధ్య శుక్రవారం సాయంత్రం సాయికుమార్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

పోలీస్ బందోబస్తు మధ్య పోస్ట్‌మార్టం

సుల్తానాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో హత్యకు గురైన పూరెళ్ల సాయికుమార్ మృతదేహానికి శుక్రవారం సుల్తానాబాద్ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. సంఘటన జరిగిన గురువారం రాత్రి నుంచి మృతుడి బంధువులు పెద్దఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఆస్పత్రి వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తు మధ్య సాయికుమార్ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్ పోలీస్ అధికారులు బందోబస్తు పర్యవేక్షించారు. మధ్యాహ్నం లోగా పోస్ట్‌మార్టం ప్రక్రియ పూర్తి కావడంతో బందోబస్తు మధ్య మృతదేహాన్ని ముప్పిరితోటకు తరలించారు. మృతుడి బంధువులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ కు సన్నిహితులు కావడంతో పలువురు నాయకులు ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత



వాహనంలో రేషన్ బియ్యం

గన్నేరువరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ చుట్టుపక్కల గ్రామాల నుంచి సేకరించిన పీడీఎస్ బియ్యం సుమారు 17 క్వింటాళ్లను వ్యాన్‌లో గుండ్లపల్లి మీదుగా సిద్దిపేటకు తరలిస్తుండగా శుక్రవారం గుండ్లపల్లిస్టేజి వద్ద గన్నేరువరం పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ బొమ్మ స్వామిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

బాలికను వేధించిన కేసులో రెండు సంవత్సరాల జైలుశిక్ష

జగిత్యాల క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడి, అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడికి రెండు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.25వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కోడిమ్యాల పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన మహమ్మద్ అంకూస్ అనే 20సంవత్సరాల యువకుడు 2019 సంవత్సరంలో అదే మండలంలోని ఓగ్రామానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై శివకృష్ణ కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు సాగర్, కిరణ్, రాజు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామ కృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి అంకూస్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

దొంగను పట్టుకున్న రాజన్న ఆలయ సిబ్బంది

వేములవాడ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ, మున్సిపల్ ప్రాంతాల్లోని విద్యుత్ వైర్‌ను దొంగిలిస్తున్న కోరుట్ల ప్రాంతానికిచెందిన శ్రీనివాస్ అనేవ్యక్తిని ఆలయ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. తరచూ దేవస్థానానికి చెందిన జనరేటర్ సమీపంలో, ఆలయపరిసరాల్లోని విద్యుత్‌వైర్‌ను దొంగిలించి షాపులో అమ్ముతున్నట్లు సిబ్బంది గమనించారు. శుక్ర వారం కూడా వైర్‌ను దొంగిలిస్తుండగా శ్రీనివాస్‌ను పట్టుకొని చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగించారు.

స్వగ్రామం చేరిన గల్ఫ్ మృతదేహం

గన్నేరువరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌కు చెందిన లింగంపల్లి మొండయ్య బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లగా అక్కడే ఆయన అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని ఇటీవల కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు కుటుంబసభ్యులు, గ్రామస్థులు వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన తక్షణమే స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించే ప్రయత్నం చేయగా శుక్రవారం మృతదేహం స్వగ్రామం చేరింది. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సొల్లు అజయ్‌వర్మ, న్యాయవాది లింగంపల్లి నాగరాజు కోరారు.

అంతుచిక్కని వ్యాధితో కోళ్లు మృతి

గంగాధర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపూర్ కోళ్లఫారంలో అంతుచిక్కని వ్యాధితో బాయిలర్ కోళ్లు మృతిచెందాయి. రెండురోజులుగా కోళ్లు నీరసంగా ఉంటున్నాయి. గురువారం రాత్రి బాగానే ఉన్న కోళ్లు శుక్రవారం ఉదయం మృతిచెందాయి. మృతి చెందిన కోళ్లను పశువైద్యాధికారి పరిశీలించారు. మృతిచెందిన కోళ్లను పూడ్చి పెట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోరుట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని శుక్రవారం ఉదయం సీసీఎస్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద రూ. 22,920 నగదు స్వాధీనం చేసుకొని ఆరుగురిని అరెస్టుచేసి వారినికోరుట్ల పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. వారివద్ద ఆరుసెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కొబ్బరిముక్కల సేకరణకు టెండర్ ఖరారు

మల్యాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో కొబ్బరిముక్కలు పోగు చేసుకునే టెండర్ ఎట్టకేలకు ఖరారు అయింది. శుక్రవారం దేవస్థానం అధికారులు ఆన్‌లైన్, సీల్డ్, బహిరంగ వేలం నిర్వహించగా ఈ వేలంలో హెచ్చు పాటగా రూ.91,16,666 నిలువడంతో టెండర్ ఖరారు చేశారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్ ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనిదినాలు 200కు పెంచాలి

కరీంనగర్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని టీపీసీసీ ఎస్సీ సెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరల దృష్ట్యా కూలీల వేతనం కూడా రూ.300 నుంచి రూ.600 పెంచేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాల అనుసంధానం పేరిట 7.6 కోట్ల మందికూలీల జాబ్‌కార్డులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొలగించిందని ఆరోపించారు. 10 ఏళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించాయని తెలిపారు.

పూడూర్‌లో రోడ్డు ప్రమాదం

● వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు

కొడిమ్యాల, మార్చి28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామ శివారులో కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ ఆవుల సంపత్‌కు గాయాలయ్యాయి. ఎస్సై ఎస్ సందీప్ తెలిపిన వివరాల మేరకు కరీంనగర్ వైపు నుంచి వస్తున్న వ్యాన్‌ను డ్రైవర్ అతివేగంగా నడుపుతూ పూడూర్ గ్రామ శివారులో రెండు కార్లను, ఒక లారీని ఢీకొట్టినట్లు తెలిపారు. వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



వేసవికాలం.. వాహనాలు జాగ్రత్త

ముందు జాగ్రత్తలతోనే ప్రమాదాల నియంత్రణ

కరీంనగర్ క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. పగటి వేళ బయట అడుగుపెట్టాలంటే జనాలు భయపడుతున్నారు. భానుడి ప్రతాపంతో మనుషులే కాదు వాహనాలకూ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. హైదరాబాద్‌లో బుధవారం ఒక పోలీస్ వాహనంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. ప్రస్తుత వేసవి కాలంలో వాహనాల్లో ప్రయాణించాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యధిక ఉష్ణోగ్రతలతో వాహనాలకు ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని గుర్తించాలి. వాహనాల్లో ఇంజిన్, విద్యుత్ సరఫరా చేసే వైర్లలో సమస్యలు తలెత్తి మంటలు చెలరేగే అవకాశం ఉంది. వేగంగా వెళ్తున్న సమయంలో ఇతర వాహనాలను ఢీకొన్న సమయంలో పెట్రోల్, డీజిల్ లీకేజీ అయి మంటలు అంటుకునే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో నడుస్తున్న వాహనం, నిలిపి ఉన్న వాహనాల నుంచే అకస్మాత్తుగా మంటలు వస్తాయి. వాహనాల్లోని వైరింగ్‌లో నాణ్యత లోపం, ఇంజన్ వేడెక్కడం, ఆయిల్, డీజిల్, పెట్రోల్, గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు అంటుకునే ప్రమాదముంది. వేసవిలో పాత వాహనాలు ఎక్కువగా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవాలి. వేసవిలో వాహనాల ఇంజన్లు వేడెక్కుతుంటాయి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ప్రమాదాల బారినపడకుండా కాపాడుకోవచ్చు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ (ఈవీ) ద్విచక్ర వాహనాలు, కార్లు వేల సంఖ్యలో నడుస్తున్నాయి. వేసవిలో ఈవీ వాహనాలు త్వరగా వేడెక్కి మంటలు అంటుకునే అవకాశాలుంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈవీ వాహనాలకు చార్జింగ్ చేసే సమయంలో, ఎక్కువ దూరం వెళుతున్న సందర్భంలో జాగ్రత్తగా ఉండాలంటున్నారు.

వైరింగ్ నాణ్యత లోపంతో షార్ట్ సర్క్యూట్ జరుగుతుంది

\- కానిగంటి రమేష్, కార్ మెకానిక్ అసోసియేషన్ కరీంనగర్ అధ్యక్షుడు



బైక్, కారు, జీపు, ఇతర వాహనాల్లో నాణ్యత లేని వైర్లను ఉపయోగించడంతో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా వాహనాల తయారీ సమయంలో దాని సామర్థ్యాన్ని తట్టుకునే విధంగా కంపెనీ వైర్ ఫిట్టింగ్ ఉంటుంది. వాహనాల్లో వైరింగ్ దెబ్బతిన్న విషయం గుర్తించకపోవడం, వైర్లు ఒకదానికి మరొకటి కలవడంతో మంటలు అంటుకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల్లో పెట్రోల్, డీజిల్ గ్యాస్ లీకేజీలు గమనించకుంటే ఎండలకు ఇంజన్ వేడెక్కి హఠాత్తుగా మంటలు వ్యాపిస్తాయి. ఎలక్ట్రిక్ వాహనాల యజమానులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి.

● మంటలు వచ్చేందుకు కారణాలు

- వాహనాల్లో వాడుతున్న ఇంధనాలన్నీ ఇంజన్ ఆయిల్, పెట్రోల్, డీజిల్, గ్యాస్ మండే స్వభావం ఉన్నవి.
- వేసవిలో ఇంజన్ త్వరగా వేడెక్కుతుంది. దూర ప్రయాణంలో మధ్యలో కొంత



  సమయం విరామం తీసుకోవాలి.
- ఇంధనాలు ఏమాత్రం లీకైనా వేడికి మంటలు వచ్చేందుకు అవకాశం ఉంటుంది.
- వాహనాల్లో తక్కువ నాణ్యత వైర్లు వాడటంతో కూడా స్పార్క్ వచ్చి మంటలు అంటుకునే ప్రమాదమున్నది.
- వాహనాల్లో ఫాగ్ లైట్స్, స్టీరియో, సౌండ్స్ సెల్‌ఫోన్ చార్జర్, ఇతర డెకోరేషన్ లైట్స్ వంటివి అదనంగా బిగించడంతో వైరింగ్‌పై లోడ్ పడి దెబ్బతింటున్నాయి.
- పాత వాహనాలకు గ్యాస్‌కిట్‌లను అమర్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే లీకేజీ కారణంగా మంటలు అంటుకుంటాయి.
- షోరూం ఎల్పీజీ వర్షన్‌లో వచ్చిన కార్లు కాకుండా పాత కార్లకు తక్కువ నాణ్యత కలిగిన గ్యాస్ కిట్లు అమర్చడంతో గ్యాస్ లీకేజీతో ప్రమాదాలు జరుగుతాయి.

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు...



- ప్రతి కారును నిర్ణీత సమయలో సర్వీసింగ్ చేయించుకోవాలి.
- 10 వేల కిలోమీటర్లు తిరిగిన తర్వాత వాహనం ఇంజన్‌లో ఉండే ఆయిల్ ఫిల్టర్లను మార్చుకోవాలి.
- కారు నుంచి మంటలు వచ్చినప్పుడు దూరంగా ఉండాలి. అటువైపు ట్రాఫిక్ రాకుండా చూడాలి.
- వాహనంలో ఉన్నప్పుడు మంటలు, కాలుతున్న వాసన వస్తే వాహనాన్ని నిలిపివేసి తనిఖీ చేయాలి.
- మండే స్వభావం ఉన్న గ్యాస్ డబ్బాలు, ఇంధనాలు తీసుకెళ్లకుండా జాగ్రత్త వహించాలి.
- కారు ఇంజన్ కూలింగ్ కోసం కూలెంట్ వాటర్‌ను పోయాలి. ఇది ఇంజన్ వేడెక్కకుండా కాపాడుతుంది.
- తరచు ఇంజన్ ఉష్ణోగ్రతను తనిఖీ చేస్తుండాలి.
- గుర్తింపు పొందిన సెంటర్లలోనే వాహనాలను సర్వీసింగ్ చేయించాలి.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముత్తారం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన రొయ్యల రాజకుమార్(26) పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. రొయ్యల రాజకుమార్ ఓ దినపత్రికకు రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిస కాగా గ్రామానికి చెందిన ఒకరి వద్ద రూ.లక్ష అప్పుచేశాడు. అందులో రూ.50వేలు చెల్లించాడు. మద్యం మానేసి మిగతా అప్పుచెల్లించాలని తల్లి కొమురమ్మ రాజకుమార్‌ను మందలించింది. ఈనెల 17న మద్యంలో పురుగులమందు కలుపుకొని తాగి ఇంటికి వచ్చి తల్లికి తెలిపాడు. దీంతో హుటాహుటిన కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి అనంతరం వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

పెంచికలపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను శుక్రవారం ఉదయం ఎల్కపల్లి పెట్రోల్‌పంపు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూరుమండలం మర్తిడి గ్రామంనుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ సంతకు తరలిస్తున్న ఐదు ఎద్దులు, రెండు దున్నపోతులను తరలిస్తున్న వాహనాన్ని సమాచారం మేరకు పట్టుకున్నారు. పశువులను తరలిస్తున్న కరీంనగర్‌కు చెందిన జాఫర్, అహ్మద్ రఫీ, బెజ్జూరు మండలం కుకుడ గ్రామానికి చెందిన శ్రీశైలం అనే ముగ్గురిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

పెద్దపల్లిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) పట్టణానికి చెందిన కొంతం శ్రావణ్ కమాన్ నుంచి జెండా చౌరస్తాకు బైక్‌పై వెళ్తుండగా మోబైల్ పడిపోయింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రవికాంత్‌కు అది దొరకగా ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. శ్రావణ్‌కు సెల్‌ఫోన్ అందజేశాడు.

అగ్నిప్రమాదాలపై ఆర్టీసీ డిపోలో అవగాహన



ఆర్టీసీ డిపో-2లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వేసవిదృష్ట్యా అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా చేపట్టాల్సిన రక్షణచర్యలపై కరీంనగర్ అగ్నిమాపకశాఖ అధికారులు గురువారం ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అగ్నిమాపకఅధికారి సుల్తాన్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం డిపోలో ఎలక్ట్రిక్ బస్సులతోపాటు ఇతర బస్సులున్నాయని, వేసవిలో ఇంజన్ వేడెక్కి మంటలు అంటుకునే ప్రమాదముందని అన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ బస్సులడ్రైవర్లు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అనంతరం ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణచర్యలపై అగ్నిమాపకశాఖ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ఏఈ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు వద్ద విరిగిన హైట్ గేజ్

● మరమ్మతు చేసిన అధికారులు



రైల్వే గేటు వద్ద విగిన హైట్ గేజ్

కరీంనగర్ రూరల్; మార్చి 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రహదారిపై రైల్వే గేటు వద్ద భారీ చేసిన హైట్ గేజ్ విరగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం రెడ్ మిక్స్ వాహనం పైపు తాకడంతో విద్యుత్ లైన్ రక్షణ కోసం ఏర్పాటు చేసిన హైట్ గేజ్‌విరిగింది. వెంటనే సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, అధికారులు మరమ్మతు చేపట్టారు. మరమ్మతుచేసే సమయంలో ట్రాఫిక్‌జామ్‌తో అవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు గంటల తరువాత రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ఆర్టీసీ జోనల్ ఆస్పత్రి తనిఖీ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఈడీ ఖుస్రోషాఖాన్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ గిరిసింహారావు

భగత్‌నగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ జోనల్ ఆస్పత్రిని జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన వివిధ పరికరాలను పరిశీలించారు. అనంతరం వేసవిలోలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ బీవీ రావు, జోనల్ వర్క్ షాప్ మేనేజర్ సుగుణాకర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్.మధుసూదన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులలో సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీ

● 31675.47 క్వింటాళ్ల ధాన్యం నిల్వలో తేడా ● అధికారులతో యజమాని వాగ్వాదం

మంథని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరయ్యపల్లి శ్రీలక్ష్మి మాడ్రన్ రైస్‌మిల్లుకు అనుబంధంగా ఉన్న గంగాపురిలోని సత్యసాయి పారాబాయిల్డ్ రైస్‌మిల్లులో నిల్వలపై సివిల్ సప్లయి ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు శుక్రవారంతనిఖీ చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎఫ్‌సీఐ అధికారులు శ్రీలక్ష్మి పారాబాయిల్డ్, రైస్‌మిల్‌లో తనిఖీలు నిర్వహించారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన ధాన్యం, బియ్యంనిల్వ2023-24 సంవత్సరానికిగాను ఎఫ్‌సీఐకి సంబంధించిన ధాన్యం, బియ్యం నిల్వలపై అధికారులు తనిఖీలు చేశారు. గంగాపురిలోని శ్రీసత్యసాయి రైస్‌మిల్లులో తనిఖీ చేయగా 41,365.27 క్వింటాళ్ల ధాన్యంకు గాను 9689.8 క్వింటాళ్ళు మాత్రమే లెక్కలోకి వచ్చాయి. మిగితా 31675.47 క్వింటాళ్ళ ధాన్యం స్వాహా అయినట్లు అధికారులు గుర్తించారు. తనిఖీ చేస్తున్న అధికారులతో మిల్లు యజమాని పొల్లాల సత్యనారాయణ వాగ్వాదానికి దిగాడు. తనిఖీల పై సివిల్ సప్లై టాస్కుఫోర్సు ఓఎస్‌డీ ప్రభాకర్, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ.. తనిఖీల్లో 31675.47 క్వింటాళ్ళ ధాన్యం తక్కువగా వచ్చినట్లు తెలిపారు. 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి 19,339 క్వింటాళ్లు ధాన్యం, బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించామని పెద్దపల్లి గోదాం మేనేజర్ వెంకటేష్‌సాగర్ తెలిపారు. నిల్వఉన్న బ్యాగ్‌లు మాత్రం వేరుగా ఉన్నట్లు గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. తనిఖీలపై రైస్‌మిల్లు యాజమాని సత్యనారాయణ మాట్లాడుతూ. మిల్లులో 2024 డిసెంబర్ 31 లోగా టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్ ధాన్యం నిల్వలు తీసుకెళ్లాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయన్నారు. ధాన్యం తీసుకెళ్ళక పోవడం వాళ్ళ తప్పే అన్నారు. తనిఖీలో ఎలాంటి తేడాలు వచ్చిన హైకోర్టు ఉత్తర్వుల మేరకు డబ్బులు చెల్లించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఎస్ఐ జంగయ్య, డీటీ సంతోష్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



అధికారులతో వాగ్వాదం చేస్తున్న మిల్లు యజమాని

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. రాజన్న ఆలయానికి శుక్రవారం భక్తులు తరలివచ్చి ఆలయకల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజన్నను దర్శించకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని తిరుగు ప్రయాణమయ్యారు.

అగ్రహారం అంజన్న హుండీ లెక్కింపు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన అగ్రహారం ఆంజనేయ స్వామి ఆలయ హుండీలను శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఓపెన్ ప్లేస్‌లో ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడు నెలల హుండీలను విప్పి లెక్కించగా ఆలయ ఖజానాకు రూ. 2 లక్షల 3 వేల 292 నగదు ఆదాయ సమకూరినట్లు తెలిపారు. హుండీల లెక్కింపులో ఆలయ ఉద్యోగులు వంశీయ ధర్మకర్త మహేందర్, దేవాదాయ శాఖ పరిశీలకుడు రాజమౌళి, సత్యసాయిసేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

జయంతి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

● అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

● కొండగట్టులో పరిశీలన



కొండపైన అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

మల్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలోజరిగే హనుమాన్ చిన్నజయంతి ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అధికారులకు సూచించారు. గతశనివారం జిల్లా కలెక్టర్, ఎస్పీ ఏర్పాట్లపై వివిధశాఖల అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సూచనలు ఇచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం అడిషనల్ కలెక్టర్ కొండగట్టులో పర్యటించారు. జయంతికి చేపట్టిన ఏర్పాట్లను దేవస్థానం అధికారులు, ఆలయఅర్చకులతో కలిసి కొండపైన ఆలయప్రాంతం, కోనేరు, వైజంక్షన్‌తదితరప్రాంతాలను పరిశీలించారు. కొండపైకివచ్చే భక్తులు, జయంతికి తరలివచ్చే దీక్ష స్వాములు ఎలాంటి ఇబ్బందులు పడకుండా త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అడిషనల్‌కలెక్టర్ వెంట ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఆర్డీవోమధుసూదన్, స్థానాచార్యులు కపీందర్, దేవస్థానం పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, తహసీల్దార్ మునీందర్, ఆర్ఐ తిరుపతి ఇతర అధికారులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మంథనిరూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టుపల్లి శివారు వద్ద అక్రమంగా తరలిస్తున్న 12క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. అడవి సోమన్‌పల్లి గ్రామానికి చెందిన గొంతినర్సయ్య అనేవ్యక్తి ట్రాలీ ఆటోలో 12క్వింటాళ్ల బియ్యాన్నిఅక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్ నర్సయ్యను విచారించగా అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన వేముల మహేష్ చెప్పిన విధంగా మహారాష్ట్రలోని సిర్వోంచకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఇంటర్‌లో హెచ్‌సీఈసీ కోర్సు ప్రవేశపెట్టాలి

● చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి

జగిత్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ఆర్ట్స్‌విభాగంలో హెచ్‌సీఈసీ (చరిత్ర, కామర్స్, అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం) కోర్సు ప్రవేశపెట్టాల్సిన అవసరముందని చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గర్ల్స్ జూనియర్ కళాశాల ఆవరణలో చరిత్ర జూనియర్ లెక్చరర్ల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పోతరవేణి తిరుపతి హాజరై మాట్లాడారు. 1976 సంవత్సరంలో ఇంటర్ విద్యలో ప్రవేశపెట్టిన సాంప్రదాయ కోర్సులే ఇప్పటికీ కొనసాగడం శోచనీయమన్నారు. ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా సాంప్రదాయ ఆర్ట్స్ కోర్సులైన హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులను కలిపి హెచ్‌సీఈసీతో నూతన కోర్సు రూపకల్పన చేసి ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లాచరిత్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొత్తూరి మహేశ్ కుమార్, చరిత్ర జూనియర్ లెక్చరర్లు సుదర్శన్, నరేశ్, రామ్ ప్రసాద్, దేవేందర్, నిర్మల, రజిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చరిత్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పోతరవేణి తిరుపతి

పేపర్ బ్యాగుల తయారీపై విద్యార్థులకు శిక్షణ



పేపర్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు అంజయ్య

చందుర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పేపర్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ.. ప్లాస్టిక్ వినియోగం నివారణలో భాగంగా వ్యర్థ పేపర్లను వినియోగించి పేపర్ బ్యాగులు, పేపర్ ఫైల్ తయారు చేయడంలో ఉపాధ్యయుడు మేడికాల అంజయ్య విద్యార్థులకు రెండు రోజులు శిక్షణ ఇచ్చాడు. విద్యార్థులు పలు రకాల బ్యాగులు, వివిధ రకాల పత్రాలు భద్రపరచుకోవడానికి పేపర్ ఫైళ్లను తయారు చేసి ప్రదర్శించారు. ప్లాస్టిక్ బదులుగా పేపర్ బ్యాగ్‌లు, పేపర్ ఫైల్ వాడుకోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు అంజయ్య మాట్లాడుతూ త్వరగా మట్టిలో కలిసిపోయే పేపర్ బ్యాగ్‌లు పర్యవరణానికి ఎంతో మేలు చేస్తాయని, వీటితయారీకి ఎలాంటి ఖర్చు ఉండదన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పిస్తే భావితరాలకు కలుష్య రహిత, ప్లాస్టిక్‌రహిత సమాజాన్ని అందించవచ్చన్నారు. ప్లాస్టిక్ వలన మనదేశంలో ప్రతి యేటా లక్షలాది మంది క్యాన్సర్ బారినపడుతున్నారని, ప్లాస్టిక్ వాడకం తగ్గించి పేపర్ బ్యాగ్‌లు,జూట్,బట్టసంచులను వాడాలని పిలుపునిచ్చాడు.

ఈ సందర్భంగా శిక్షణఅందించిన అంజయ్యను ప్రధానోపాధ్యాయులతోపాటు పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, రాజు, ఉపాధ్యాయులు జావీద్, మహేశ్, శ్రీనివాస్, పద్మ, నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం

ఎండపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా కొత్తపేట గ్రామానికి చెందిన పోలోజు శ్రీనివాస్ శుక్రవారం నియామకమయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేష్ సూచన మేరకు శ్రీనివాస్ నియామకమయ్యారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించాలి

రాయికల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి ధాన్యం సేకరణను సజావుగా నిర్వహించాలని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ అన్నారు. రాయికల్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం సంఘ కార్యదర్శులు, కొనుగోలు కేంద్ర బాధ్యులు, ట్యాబ్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో మంచినీటి వసతి, తాత్కాలిక షెడ్లు ఏర్పాటుచేయాలని, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయి కుమార్‌గౌడ్, సంఘ కార్యదర్శులు ఉపేందర్ రావు, భాస్కరాచారి, చంద్రశేఖర్, జగదీష్, కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

బాలుడికి సన్మానం

రాయికల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన సోమ అభిలాష్ అనే బాలుడిని సారంగాపూర్ మండలం పెంబట్ల దుబ్బ రాజేశ్వరస్వామి దేవస్థానం అన్నదాన సేవాసమితి సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల అన్నదాన కార్యక్రమంలో నిత్యం సేవచేసిన సందర్భంగా బాలుడిని సన్మానించినట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో దుబ్బరాజేశ్వరస్వామి అన్నదాన సేవా సమితి సభ్యులు, వీరాపూర్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు 'సురక్షిత ప్రయాణం'

- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొత్త కార్యక్రమానికి శ్రీకారం - స్పీడ్ బ్రేకర్లతో పాటు హెచ్చరిక బోర్డులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు



బ్లాక్ స్పాట్ ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు, సీట్ బెల్ట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ(ఫైల్)

జగిత్యాల క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉండే పోలీస్ శాఖ రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు నడుం బిగించింది. 'సురక్షిత ప్రయాణం' అనే సరికొత్త కార్యక్రమానికి ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. తరుచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. నివారణకు హెచ్చరిక బోర్డులతో పాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలపై పట్టణాలతో పాటు పల్లెల్లో పోలీస్ కళాజాతా బృందాలు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు సైతం పోలీస్ శాఖకు సహకరిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు.

● ఎన్‌హెచ్ఏ అధికారులతో కలిసి..

జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించే ఉద్దేశంతో సురక్షిత ప్రయాణం అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఎస్పీ అశోక్ కుమార్ గత శుక్రవారం ప్రారంభించారు. నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్ఏ) అధికారులతో కలిసి మొదటగా జగిత్యాల పట్టణ శివారు, కొండగట్టు ప్రాంతాల్లో తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాద ప్రాంతాలను పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. దీంతో మెట్‌పల్లి, జగిత్యాల డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు ప్రమాదాలు తరుచుగా జరుగుతున్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులతో పాటు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు పనులను ముమ్మరంగా చేపట్టారు.

● అవగాహన సదస్సులు...

ట్రాఫిక్ నిబంధనలపై పోలీస్‌శాఖ పట్టణాల్లో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తోంది. మరోవైపు గ్రామాల్లో పోలీస్ కళాజాతా బృందాలతో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ చైతన్య పరుస్తోంది. మద్యం సేవించి, మైనర్లు వాహనాలు నడిపితే కలిగే అనర్థాలపై వివరిస్తున్నారు. రాత్రి వేళల్లో వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాతా బృందం సభ్యులు వివరిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణలో వారి పాత్రను పోషిస్తున్నారు. జాతీయ రహదారులు ఆనుకుని ఉన్న గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు, దాబాలు, హోటళ్లు, పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న సిబ్బందికి, యువతీ, యువకులకు రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో తక్షణం పాటించాల్సిన చర్యలపై వివరిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడి గుండెపోటుకు గురైన వారిని సీపీఆర్ ద్వారా రక్షించే విధానంపై వివరిస్తున్నారు.

● 43 బ్లాక్ స్పాట్ ప్రాంతాలు ...

జిల్లాలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను పోలీసులు 43 బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. ముఖ్యంగా హైవేలు, మూల మలుపులు, బ్రిడ్జీలు, చౌరస్తాలు ఇలా తదితర ప్రదేశాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. వాటిలో ముఖ్యంగా కొండగట్టు నుంచి దొంగలమర్రి వరకు, నల్లగొండ లక్ష్మీనృసింహస్వామి ఆలయ మూలమలుపు, పూడూరు గ్రామ శివారు ఆరేపల్లి మూల మలుపు, తారక రామ నగర్ బ్రిడ్జి, జిల్లా కేంద్రంలోని చిన్న కెనాల్ చౌరస్తా, జగిత్యాల పట్టణం మీదుగా మెట్‌పల్లి శివారు, జగిత్యాల నుంచి రాయపట్నం వంతెన, జగిత్యాల నుంచి ఎండపల్లి మండలం రాజారాంపల్లి చౌరస్తా వరకు అన్ని మూలమలుపులను, చౌరస్తాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. దీంతో పాటు జిల్లాలోని అన్ని మండల్లాల్లో ఉన్న ప్రధాన గ్రామాలు వాటి పరిధిలో తరుచుగా జరిగే రోడ్డు ప్రమాదాల ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి రక్షణ చర్యలు చేపడుతున్నారు. నివారణ కోసం పలు ప్రాంతాల్లో తెల్ల రంగులతో కూడిన స్పీడ్ బ్రేకర్లతో పాటు జీబ్రా గీతలు, హెచ్చరిక బోర్డులును ఏర్పాటు చేసే పనుల్లో పోలీస్ అధికారులు నిమగ్నం అయ్యారు.

● హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాధాన్యంపై..

రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ జిల్లా వ్యాప్తంగా పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ముఖ్యంగా హెల్మెట్ , సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడుపడం వల్ల కలిగే లాభాలు, ధరించకపోవడంతో కలిగే అనర్థాలను వాహనదారులకు వివరిస్తున్నారు. ఇటీవల జరిగిన జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ అశోక్ కుమార్ పలు వాహనాలను స్వయంగా తనిఖీ చేసి డ్రైవర్లుకు సీట్ బెల్టు ప్రాధాన్యాన్ని వివరించారు. అంతే కాకుండా స్వచ్ఛంద సంస్థల సహకారంతో హెల్మెట్లు సైతం అందజేశారు.

ప్రజల భాగస్వామ్యంతోనే..

ఎస్పీ అశోక్ కుమార్



ప్రజల భాగస్వామ్యంతోనే రోడ్డు ప్రమాదాలను నివారంచవచ్చు. విధిగా ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. హైవేలు, ప్రధాన రహదారుల పక్కన ట్రక్కులు, లారీలు రోడ్డు పక్కన నిలుప వద్దు. రాత్రివేళ ప్రమాదాల నివారణ కోసం లైటింగ్ సదుపాయాలను మెరుగుపరుచుకోవాలి. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలి. నివారణకోసం జిల్లాలో 43 బ్లాక్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు చేపడుతున్నాం.

డుమ్మాలకు చెక్

(5వ పేజీ తరువాయి)

ప్రచారం జరుగు తోంది. అబాస్ హాజరు విధానంపై కొందరు ఉద్యో గులు, సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్న చర్చలు వైద్య ఆరోగ్య శాఖలో వినిపిస్తున్నాయి.

ఖమ్మంలో పైలట్ ప్రాజెక్ట్..

అబాస్ ద్వారా అటెండెన్స్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా ఖమ్మంలో కొనసాగుతోంది. అక్కడ సిబ్బంది డుమ్మాలకు చెక్ పెట్టడంతో రాష్ట్రమంతటా అమలు చేయాలని వైద్యారోగ్య శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల డీఎంహెచ్‌వోకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆదేశించింది. దీంతో జిల్లాలోని వైద్యారోగ్య శాఖ కసరత్తును ప్రారంభించింది. ఉద్యోగుల వివరాలను యూడీసీలు సేకరిస్తున్నారు. త్వరలో ఈ యాప్ ద్వారానే అటెండెన్స్‌ను అమలు చేయనున్నారు. అత్యవసర సిబ్బంది కావడంతో వెసులుబాటుకు అవకాశం ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

వివరాలను సేకరిస్తున్నాము

- డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి



అబాస్ కోసం సిబ్బంది వివరాలను సేకరిస్తున్నాము. మరికొద్ది రోజుల్లో పూర్తి కానుంది. ఈ వివరాలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి పంపిస్తాము. వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయగానే అబాస్ ద్వారానే అటెండెంట్స్‌ను అమలు చేస్తాము.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలి


బహుమతులు ప్రదానం చేస్తున్న నరేందర్‌రెడ్డి, డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఓ లక్ష్యం ఏర్పరుచుకొని చదువుపై శ్రద్ధ వహించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా నరేందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శివవీధి అల్ఫోర్స్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. వేడుకలకు నరేందర్‌రెడ్డితో పాటు, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలతో ఆప్యాయంగా మెదిలితే వారిలో దాగిఉన్న ప్రతిభ గుర్తించే అవకాశం ఉందన్నారు. విద్యారంగ అభివృద్ధికి అల్ఫోర్స్ విద్యాసంస్థలు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి, ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక, కళాప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మల్యాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు సమీపంలో ఓ వ్యక్తిని రక్షించబోయిన వంశీదర్‌రావు(36) అనే యువకుడు ద్విచక్రవాహనం ఢీకొని మృతిచెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొండగట్టు సమీపంలోని పంచముఖీ ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి మధుర నరేశ్ అనే వ్యక్తి నడుచుకుంటూ వస్తూ కిందపడిపోయాడు. వెనుకాలే ద్విచక్రవాహనంపై నుంచి వస్తున్న మల్యాల మండలం గొర్రెగుండంకు చెందిన వంశీదర్‌రావు(36) నరేశ్‌ను గమనించి రక్షించే ప్రయత్నం చేస్తుండగానే వేగంగా వచ్చిన పల్లెపు రాజేశ్ ద్విచక్రవాహనం వంశీదర్‌రావును ఢీకొట్టింది. దీంతో వంశీదర్‌రావు, రాజేశ్ ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు వంశీదర్‌రావు, రాజేశ్, నరేశ్‌ను జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ వంశీధర్‌రావు మృతి చెందినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గాయపడిన వ్యక్తులు జగిత్యాల, కొండగట్టుకు చెందిన వారిగా తెలిపారు.

వార సంత వేలం

వెల్గటూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్‌లో ప్రతీ బుధవారం నిర్వహించే కూరగాయల సంతకు తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి శేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం వేలం నిర్వహించారు. వేలం పాటలో ఎనిమిది మంది పాల్గొన్నారు. సర్కారు వారి పాట రూ.1,53,730లతో ప్రారంభించగా గాజుల చంద్రయ్య, జూపాక కిరణ్ పోటా పోటీగా వేలం పాటలో పాల్గొన్నారు. చివరికి గాజుల చంద్రయ్య రూ.2.50 లక్షలకు వేలం దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్ రావు, గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ జూపాక ప్రవీణ్, గుండాటి సందీప్‌రెడ్డి, బండమీది ముత్తయ్య పాల్గొన్నారు.

ఎండపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజారాంపల్లి గ్రామంలోని వారసంత వేలంపాట శుక్రవారం జిల్లా పంచాయతి అధికారి మధన్ మోహన్ ఆధ్వర్యంలో జరిగింది. మొత్తం 13 మంది వేలం పాటలో పాల్గొనగా సంగ రాములు అనే వ్యక్తి 35 లక్షల 11 వేలకు వారసంతను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉప్పులపెల్లి నరేష్‌కుమార్, ఎంపీవో జక్కుల శ్రీనివాస్, పంచాయతి కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, సంజయ్‌లకు పండ్లు తినిపిస్తున్న ముస్లింలు

గొల్లపెల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి గొల్లపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

● ముస్లింలకు రంజాన్ పవిత్ర మాసం

రాయికల్, (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు రంజాన్ మాసం పవిత్రమైనదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని షాదీఖానా ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొని ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలు పవిత్రంగా, ఉపవాస దీక్షతో కొనసాగిస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీడీవో చిరంజీవి, మున్సి పల్ మాజీ చైర్మన్ మోర హన్మాండ్లు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు ఇంతియాజ్, సోహెల్, బాబా, ముఖీం తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీకగా కోరుట్ల నిలవాలి

కోరుట్ల (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా కోరుట్ల పట్టణం నిలవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. పట్టణంలోని కాల్వ గడ్డ ప్రాంతంలోని ఓ పంక్షన్ హాల్‌లో ముస్లింల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. హిందూముస్లింలు కలిసిమెలిసి పండగలను నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

కొడిమ్యాలలో ఇఫ్తార్ విందు..

కొడిమ్యాల: మండల కేంద్రంలోని మజీద్‌లో శుక్రవారం రాత్రి ముస్లింలకు మాజీ సర్పంచు ఏలేటి మమత నర్సింహరెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ నాయకులు మహ్మద్ రోషన్, అజీద్‌ఖాన్, నసీరొద్దీన్, హమీద్, నత్తడ్, ఖాసీం, సల్మాన్, సాబీర్ తదితరులు పాల్గొన్నారు.

సమర్ధవంతంగా పెట్రోలింగ్

జగిత్యాల క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి సమయంలో సమర్ధవంతమైన పెట్రోలింగ్ ద్వారా ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్అలీఖాన్, ఎస్సైలు గీత, మన్మధరావు, కిరణ్‌కుమార్ ఉన్నారు.

ఇటుకబట్టీ కార్మికుల తరలింపు

జగిత్యాలరూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ శివారులో గల ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న 93 మంది కూలీలను స్వరాష్ట్రం ఒరిస్సాకు జిల్లా కార్మికశాఖ అధికారులు తరలించారు. రెండురోజుల క్రితం నర్సింగాపూర్ ప్రభుత్వ భూమిలో ఏర్పాటుచేసిన ఇటుకబట్టీలను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈనేపథ్యంలో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న అధికారులను కార్మికశాఖ అధికారులు వారి స్వగ్రామాలకు తరలించారు.

నేటితో ముగియనున్న జీవన్‌రెడ్డి పదవీ కాలం



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పదవీ కాలం శనివారంతో ముగుస్తోంది. నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్-కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికై 2019 మార్చి 30వ తేదీన ప్రమాణస్వీకారం చేశారు. ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ పదవికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఎన్నికలను పూర్తి చేసింది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల స్థానాన్ని బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి చిన్నమైల్ కైవసం చేసుకున్నారు. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాలతో సుదీర్ఘ అనుభవాన్ని కలిగియున్న జీవన్‌రెడ్డి భవిష్యత్తు రాజకీయం ఏ విధంగా ఉండబోతుందన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది. కాగా పదవీకాలం పూర్తి చేసుకుంటున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా సన్మానించారు.

ఎంపీ నిధులతో తాండ్రాలలో బోరుబావి నిర్మాణం

కథలాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్రాలలో కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ నిధులతో ఏర్పాటు చేయనున్న బోరుబావి పనులను శుక్రవారం బీజేపీ నాయకులు ప్రారంభించారు. హన్‌మాన్ ఆలయం వద్ద బోరుబావిని ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, పిడుగు ఆనంద్‌రెడ్డి, నరెడ్ల రవి, జలంధర్, గంగమల్లయ్య, చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

జైభీం, జై సంవిధాన్ కోఆర్డినేట్‌గా కొమురయ్య

కథలాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జైభీం, జైబాపు, జై సంవిధాన్ ప్రోగ్రాం మండల కోఆర్డినేటర్‌గా పుప్పాల కొమురయ్యను నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ సిఫార్సు మేరకు కొమురయ్యను నియమించారు.

మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు చోటుకల్పించాలి

జగిత్యాల అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఈ సారి జరిగే మంత్రి వర్గ విస్తరణలో మాదిగలకు చోటు కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దూమాల గంగారాం మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్మపురి శాసన సభ్యుడిగా ఎన్నికైన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సురుగు శ్రీనివాస్, బెజ్జంకి సతీష్, నక్క రమేష్, బొల్లె అనిల్, బొనగిరి కిషన్, పోడేటి సునీల్, బిరుదుల గంగారాం, బాపురపు గంగన్న రేగుంట లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

కోరుట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తాన ని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో కోరుట్ల పట్టణ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయ కులు అంజయ్య, హరీష్, రాజేష్, మదన్‌మోహన్, సంపూర్ణచారి, వేణుగోపాల్, వంశీ, బీవి రంగరావు పాల్గొన్నారు.

బాలిక చికిత్సకు ఆర్థిక సాయం

మల్లాపూర్, మార్చి, 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిపేటలో చిన్నారి చికిత్స కోసం శుక్రవారం పలువురు దాతలు ఆర్థిక సాయం చేశారు. గ్రామంలోని గడ్డం విజయలక్ష్మి అనే చిన్నారి పదిహేను రోజుల క్రితం ప్రహరీ కూలిన ప్రమాదంలో గాయపడింది. తల్లిదండ్రులు చిన్నారికి చికిత్స చేయించడానికి ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న హనుమాన్ భక్తులు రూ. 13800, సేవా వారధి గ్రూపు సభ్యులు రూ. 12500లను నగదును చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు.

హనుమాన్ ఆలయ స్తంభాలు కూల్చివేత


పోతారం అడవుల్లో స్తంభాలు కూల్చివేసిన అటవీ అధికారులు

కథలాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం అడవుల్లో పురాతన కాలం నుంచి బండపై ఉన్న ఆంజనేయస్వామి ప్రతిమ వద్ద గ్రామస్థులు ఆలయ నిర్మాణానికి పూనుకుని స్తంభాలు ఏర్పాటు చేసుకోగా ఫారెస్ట్ అధికారులు కూల్చివేయడం చర్చనీయాంశంగా మారింది. ఏళ్ల కాలం నుంచి ఆంజనేయస్వామి వద్ద పూజలు చేస్తున్నామని ఆలయం నిర్మించుకునేందుకు విరాళాలు పోగు చేసుకుని ప్రయత్నం చేస్తుంటే అధికారులు కూల్చివేయడాన్ని తప్పుబడుతున్నారు. భూమి ఆక్రమణకు గురవుతుందనే కారణంతో ఫారెస్ట్ అధికారులు ఈ చర్యకు పూనుకోగా వివాదాస్పదంగా మారింది. ఫారెస్టుకు సంబంధించిన చెట్లను ఎక్కడా ధ్వంసం చేయలేదని, ఆధ్యాత్మిక భావనతో ఆలయం నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నామని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ అంశం వివాదాస్పదం కావడంతో శుక్రవారం ఎస్సై నవీన్ గ్రామస్థులతో సమావేశం ఏర్పాటుచేసి సామరస్యంగా ఉండాలని సూచించారు.

ఏరియా ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

కోరుట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని కాయకల్ప పీర్ అసెస్‌మెంట్ బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా ఆసుపత్రిలోని వసతులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. బయో మెడికల్ వేస్టేజీని ఎలా వాడుతున్నారో సిబ్బంది తెలుసుకున్నారు. రోగులు తీసుకుంటున్న జాగ్రత్తలపై వివరిస్తున్న విషయాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాయకల్ప బృందం డాక్టర్ రవీందర్, డాక్టర్ అనిల్, నర్సింగ్ ఆఫీసర్స్ బ్లోసమ్, ఝున్సీరాణి, కోరుట్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీతరాణి, ఆర్ఎంవో డాక్టర్ వినోద్, శానిటేషన్ ఇన్‌చార్జి డాక్టర్ రమేష్, డాక్టర్ చైత్యన సుధ, డాక్టర్ నీలోఫర్, డాక్టర్ కళ్యాణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ సరళ, లలిత, మేరి నర్సింగ్ ఆఫీసర్ కవిత, ఫార్మసిస్ట్ ఉదయ్‌ప్రసాద్ పాల్గొన్నారు.


కాయకల్ప బృందం సభ్యులతో స్థానిక సిబ్బంది

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం దావ వసంత విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. శాసనమండలి, శాసనసభలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజల సమస్యలపై మాట్లాడడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీలు రమణతో పాటు కవిత జగిత్యాల ప్రాంత సమస్యలను వివరించారని వాటిని అమలుపరిచేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కొండగట్టు అంజన్న దేవాలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేయడంతో పాటు రైతులకు సాగునీరు అందించే రోళ్ల వాగు ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏప్రిల్ 22న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్, నాయకులు వొల్లెం మల్లేశం, రిజ్వాన్, దామోదర్‌రావు, శ్రీనివాస్, శేఖర్, వేణు మాధవ్, మోహన్, సాజిల్, పర్వేజ్, అలీ, గంగాధర్ తదితరులు ఉన్నారు.

నేడు కొడిమ్యాల వారసంత వేలం

కొడిమ్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొడిమ్యాల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే వారసంత వేలం శనివారం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి ఎల్ వంశీవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీకి చెందిన తొమ్మిది గదులను వేలం వేస్తామన్నారు. ఆసక్తి గల వారు 30 వేల రూపాయల డిపాజిట్ గ్రామపంచాయతీ కార్యాలయంలో చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మెట్‌పల్లిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకట్రావ్‌పేట గ్రామ శివారులోని ఈద్గ వద్ద జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ టి మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగా సందర్భంగా నమాజ్‌కు ముస్లింలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి శానిటరి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఇంజనీర్ విష్ణు, ముజీబ్ ఉన్నారు.

అనారోగ్యంతో జీపీ కార్మికురాలి మృతి

మల్యాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మల్యాల మేజర్ గ్రామపంచాయితీలో విధులు నిర్వహించే పారిశుద్య కార్మికురాలు దేవమ్మ(60) గురువారం రాత్రి మృతి చెందింది. గత కొంతకాలంగా అనార్యోగంతో భాధపడుచున్న దేవమ్మ దహన సంస్కారాలకు పదివేల రూపాయల నగదును పంచాయితీ ఈవో శ్రీకాంత్ అందజేశారు.

ఎకరాకు రూ. 25వేల పరిహారం అందించాలి

బీర్‌పూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సాగునీరు అందక ఎండిపోయిన వరి పంటకు ఎకరాకు 25 వేల రూపాయల నష్టపరిహారాన్ని అందించాలని మాజీ జడ్పీటీసీ బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొల్ముల రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సాగునీరుఅందక రైతులు వేసిన వరిపంటలు ఎండిపోవడంతో రైతులు నష్టపోయారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఐ అనిల్‌కుమార్‌కు సన్మానం

మెట్‌పల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మెట్‌పల్లి సీఐగా బాధ్యతలు స్వీకరించిన అనిల్‌కుమార్‌ను శుక్రవారం పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి అభినందించారు. పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ అనిల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు జాజాల రాజ్ గోపాల్, బుర్రా మహేందర్ తదితరులు పాల్గొన్నారు.